

# మరో అడుగు

## – డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

డా. రాజేష్ ఆఫీస్ లో కూర్చుని ఉన్నారు నలుగురూ.

" ఎన్నిగంటలకి వస్తానన్నారు డాక్టర్ సుజిత్?" శేఖర్ అడిగాడు.

" వచ్చేస్తాడు, మహా అయితే మరో పది నిమిషాలు " అన్నాడు రాజేష్ అతను అడిగిన తీరులోని ఆత్రుత చూసి చిన్నగా నవ్వుతూ.

దాదాపు గంటలా అనిపించిన పదినిమిషాల తర్వాత వచ్చాడు డా.సుజిత్.

వస్తూనే కూర్చోమన్న రాజేష్ మాట పట్టించుకోకుండానే నేరుగా టాపిక్ లోకి వచ్చాడు.

రాజేష్ చెప్పినట్టుగా తన ఫ్రెండ్ చెప్పినట్రస్ట్ వివరాలు చెప్పాడు.

" ఇటువంటి ట్రస్ట్ లు ఉంటాయని కూడా తెలియదు మాకు. ఎంత మంచి వార్త చెప్పారు డాక్టర్" అన్నాడు కిరణ్.

" అవునండి, మా వాడన్నది నిజమే. మనకి వరంలా దొరికింది" అన్నాడు శేఖర్ కూడా.

"ఇలాంటి ట్రస్ట్ ఉండడం, దాని గురించి మనకి తెలియడం ముఖ్యం కాదు జెంటిల్ మెన్! వారు మన కేసుని ఎందుకు పరిశీలించాలి? సానుకూలంగా ఎందుకు స్పందిచాలి? వారు స్పందించి సహాయం చెయ్యాలంటే మనం ఏం చెయ్యాలి? అనేది ముఖ్యం. అవునంటారా?" అన్నాడు.

" కరక్ట్" అన్నాడు డా.రాజేష్.

" కూర్చుని ఏం చెయ్యాలో చెప్పండి సార్" అంటూ స్నేహితుడిని కూర్చోబెట్టాడు డా. రాజేష్.

“ మనకి వారు తెలీదు, మన సిటీలో ఉన్న సవాలక్ష డాక్టర్లలో మేమిద్దరం కూడా మామూలు వాళ్ళమే, కనక మేము వారికి తెలిసే అవకాశమే లేదు. మనకేమీ రికమండేషన్ లేదు. అందుకని మనం మన పాప కేస్ ని వీలున్నంత పకడ్బందీగా రూపొందించి, ఆ తర్వాతే వాళ్ళని సంప్రదించాలి.

తనకున్న కండిషన్ గురించి, కావలసిన వైద్యం, దానికయ్యే ఖర్చులు, మీకున్న ఆర్థిక పరిస్థితులు ఇవన్నీ పూర్తిగా వారికి అర్థం అయ్యేలా నేను తయారుచేస్తాను.

పాప చిన్నప్పటినించీ ఎంత చురుగ్గా ఉండేది, ఎన్ని విజయాలు సాధించింది, ఎక్కడెక్కడ ఎన్ని పతకాలు, మెడల్స్ సాధించింది లాంటి వివరాలన్నీ మీరు నాకు వివరంగా ఇస్తే అవన్నీ కూడా జతపరిచి కేస్ ని పూర్తిగా రాస్తాను” అన్నాడు.

" అలాగేనండి. అన్ని సర్టిఫికెట్స్, మెడల్స్, కప్ లు భద్రంగా ఉన్నాయి. అలాగే వాటి వివరాలు అన్నీ రాధిక ఒక పుస్తకంలో రాసి భద్రంగా ఉంచుతుంది. కొత్త ప్రైజ్ రాగానే దాంట్లో రికార్డ్ లని అప్డేట్ చేస్తూ ఉంటుంది కనక వెంటనే తీసుకొస్తాను" అన్నాడు కిరణ్.

" రోహిణికైతే అన్నీ బట్టీయే, పుస్తకం కూడా అక్కర్లేదు" అన్నాడు శేఖర్ కూడా చిరునవ్వుతో.

చీకటిలో చిరుదీపంలా ట్రస్ట్ గురించి తెలిసేసరికి తెలియకుండానే స్నేహితులిద్దరిలో చిన్న భరోసా వచ్చింది.

" బట్టీ అక్కర్లేదు, పుస్తకం లోంచి వివరాలన్నీ ఒకచోట రాసి తీసుకుని వస్తే చాలు. ఈమెయిల్ లో పంపినా సరే." అన్నాడు డా.సుజిత్.

'మరో నాలుగైదు రోజుల్లో ఆ నివేదికని తయారుచేసి, అందరూ కలిసి దాన్ని పరిశీలించి, తామందరూ ఓకే అనుకున్నాక ఆ ట్రస్ట్ వారితో అపాయింట్ మెంట్ తీసుకుంటాననీ చెప్పాడు డా.సుజిత్.

మిత్రులిద్దరూ డాక్టర్లిద్దరికీ ధన్యవాదాలు చెప్పి బయలుదేరారు.

---

తనకేం జరుగుతోందో, తన ఒంట్లో ఉన్న రుగ్మత ఏమిటో? స్వప్నిక కి ఇంకా తెలియదు.

తనకెందుకు తరచుగా జ్వరం వస్తోందో? తన తల్లితండ్రులెందుకు తరచుగా తగనంత దిగులుగా కనిపిస్తున్నారో కూడా ఆమె చిన్న బుర్రకి తెలియడం లేదు.

ఈ మధ్య అమ్మ వంట కూడా సరిగ్గా చెయ్యడం లేదు, ఎక్కువగా రోహిణీ ఆంటీ యే టిఫిన్లు, భోజనాలు తయారుచేసి పంపిస్తోంది ఎందుకో తెలియడం లేదు.

తనకి ఒంట్లో బాగో లేక అమ్మా, నాన్నా కంగారుగా ఉన్నారని అలా చెస్తోందా? లేకపోతే అమ్మా, నాన్నలకేమైనా ఆరోగ్య సమస్యలున్నాయా? ఎలా తెలుసుకోవడం?

తమ్ముడికి చెబ్దామంటే వాడికి వాడి స్పైడర్ మాన్, సూపర్ మాన్ లాంటి కార్టూన్లు తప్ప ఏమీ పట్టవు.

అయినా పెద్ద గొప్పగా తన పిగ్గీ బాంక్ నాన్నకి ఇచ్చాడని చెప్పాడు. ఎందుకిచ్చాడో మరి? ఇలాంటి ప్రశ్నలకి సమాధానాలేమీ దొరకడం లేదు ఆమెకి.

టీనేజ్ లో ఉన్న అందరు పిల్లల్లాగానే ఆమెకి కూడా ఉత్సుకత ఎక్కువే.

తనకి వచ్చిన అనుమానాలన్నింటికీ, తన పరిధిలో సమా ధానాలని వెతికి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది.

తన టీచర్ ల ని అడిగి, స్కూల్ లైబ్రరీలోని పుస్తకాలలోంచి సమాధానాలు తెలుసుకుంటుంది.

కానీ ప్రస్తుతం ఆమె మనసులో మెదులుతున్న ప్రశ్నలకి మాత్రం జవాబులు దొరకటం లేదు.

గట్టిగా ఒక గంట కూర్చోలేకపోతోంది ఈ మధ్యన.

‘వందలాది రేసులు పరిగెత్తిన తనకి ఇంత నీరసంగా ఎందుకు ఉంటోందో? స్కూల్ కి కూడా సరిగ్గా ఎందుకు వెళ్ళలేకపోతోందో?’ అని ఆమెకి ఆందోళనగా ఉంది.

ఎవరిని అడగాలో తెలియడం లేదు.

దానికి సమాధానం ఆమె ముందున్న కంప్యూటర్ స్క్రీన్ మీద కనిపించనే కనిపించింది.

నేటి కాలంలో ప్రతీ విషయానికీ సమాధానం చెప్పే కంప్యూటరే ఆమెకి సహాయం చేసింది.

వారి మధ్య తరగతి కుటుంబంలో విలాసాలకి తావు లేదు కానీ, సంతోషానికి కొదవలేదు. ఉన్నంతలో పొదుపుగా సంసారం గడుపుతుంది రాధిక.

భార్యా పిల్లల్ని బంగారం లా చూసుకుంటాడు కిరణ్.

పిల్లలిద్దర్నీ కళ్ళల్లో పెట్టుకుని, చాలా సంస్కారవంతంగా, విలువలతో పెంచుకుంటారా దంపతులు.

వారికి కావలసిన విషయాల్లో దేనికీ రాజీ పడకుండా చూసుకుంటారు.

ప్రతీ నెలా కొద్దిగా డబ్బు దాచి, స్వప్నిక పుట్టినరోజుకి కంప్యూటర్ కొనిచ్చారు రాధికా, కిరణ్ లు.

స్కూల్ ప్రాజెక్ట్ లకి, కొత్త విషయాలు తెలుసుకోవడానికి కంప్యూటర్, ఇంటర్నెట్ ల అవసరం పెద్దవాళ్ళకి తెలుసు.

అందుకే పాప పుట్టినరోజుకి ఆ బహుమతి ప్లాన్ చేశారు.

ఇంట్లో కంప్యూటర్ వచ్చినప్పటినించీ వారి ప్రపంచం కొద్ది కొద్దిగా విస్తరించడం మొదలయింది.

గూగుల్ లో వివిధ విషయాల గురించి తెలుసుకోవడం, యూట్యూబ్ లో విడియోలు చూడడం లాంటివి బాగా అలవాటయ్యాయి.

స్వప్నిక తనకీ, అమ్మ రాధిక కి ఫేస్ బుక్ అకవుంట్ లు తెరిచింది.

కిరణ్ కూడా LinkedIn అకవుంట్ ఓపెన్ చేసి తన లాగే ఫోటోగ్రఫీ లో అభిరుచి ఉన్న తోటివారితో గ్రూప్ ల్లో చేరడం. దానివల్ల కొత్త విషయాలు తెలుసుకోవడమే కాదు, తరచుగా తన సర్వీస్ ల కోసం పని దొరకడం తో అదనపు ఆదాయం కూడా రావడం కూడా కలిసి వస్తోంది.

గత నాలుగు రోజులుగా మళ్ళీ బాగా జ్వరం రావడం తో స్కూల్ కి మళ్ళీ శలవు పెట్టవలసి రావడంతో ఆమెకి తగని చిరాగ్గా ఉంది. లేచి కూర్చోలేనంత నీరసంగా ఉండి, మంచానికే అతుక్కుపోవలసి రావడంతో ఆ చిరాకు మరింత పెరిగింది.

నెమ్మదిగా ఓపిక కూడదీసుకుని లేచి కూర్చుని, నడుముకి వెనక రెండు దిండ్లు పెట్టుకుని కూర్చుని ఒళ్ళో లాప్ టాప్ పెట్టుకుంది.

" తనకి జ్వరంగా ఉన్నప్పుడు ఎప్పుడో దీనిమీద కూడా ఎప్పుడో స్పైడర్ మాన్ స్టిక్కర్ అంటించేశాడు లావుంది" అనుకుంది కంప్యూటర్ తెరుస్తూ.

ముందు బి.బి.సి వెబ్ సైట్ లోకి వెళ్ళి కొత్త సమాచారాలున్నాయేమో చూసింది.

ఆ తర్వాత తన మెయిల్ ఓపెన్ చేసి తన స్నేహితురాలు సీమ దగ్గరనుంచి కానీ, స్కూల్ నించి కానీ, కోచ్ దగ్గరనించి కానీ మెయిల్స్ ఏమైనా వచ్చాయేమో అని చూసుకుంది.

తరచుగా వస్తున్న జ్వరాలు, ఆరోగ్య సమస్యలతో స్కూల్ మిస్ అవడంతో ఆమె స్కూల్ వర్క్ అంతా పెండింగ్ లో ఉండిపోవడం ఆమెకి నచ్చడం లేదు.

అప్పటికీ తన ప్రాణ స్నేహితురాలు సీమ తన నోట్స్ కాపీలు చేయించి తీసుకుని వస్తూనే ఉంది. అవి చదువుకుంటూ, పాఠాలని నేర్చుకుంటోంది. తనని చూడటానికి వచ్చే ఇతర స్నేహితులు కూడా వీలైనంత సహాయం చేస్తున్నారు.

అయినా స్కూల్ కి వెళ్ళి, టీచర్ల ముఖతా విని నేర్చుకోవడం పూర్తిగా వేరు. వాళ్ళని తెలివైన ప్రశ్నలు అడగడం, వారి మెప్పు పొందడం అందరు చిన్నపిల్లల్లాగే ఆమెకీ ఎంతో ఇష్టం.

అలా అన్నీ చూసుకుంటూ ఫేస్ బుక్ దగ్గర ఆగింది.

తన ఫీడ్ లో కనిపిస్తున్న ఆ యాడ్ ఆమె దృష్టిని దాటిపోలేదు.

నేషనల్ లెవెల్ లో ఎంతో పేరు తెచ్చుకున్న ఒక టీనేజ్ అథ్లీట్ కి అకస్మాత్తుగా ఎదురయిన లుకేమియా వ్యాధికి కావలసిన చికిత్స కి కావలసిన ఆర్థిక సహాయం అందించవలసినదిగా అభ్యర్థిస్తూ వచ్చిన ప్రకటన.

'యువర్స్ ఫ్రెండ్లీ డాక్టర్' అనే డా.రాజేష్ ప్రొఫైల్ నించి వచ్చినది కనక ఆమెకి కూడా కనిపించింది.

ఒక్క క్షణం ఆమెకి తను చూస్తున్నది ఏమిటనేది అర్థం కాలేదు.

చురుకైన ఆమెకి విషయం పూర్తిగా తెలియడానికి రెండు క్షణాలకంటే ఎక్కువ పట్టలేదు.

డాక్టర్ రాజేష్ నించి వచ్చిన ఆ ప్రకటన, తనకి తరచుగా ఎదురవుతున్న సమస్యలు, ఆ ప్రకటనలో ప్రత్యేకంగా అథ్లీట్ అని ప్రస్తావించడం, ఇవన్నీ చాలా తేటతెల్లంగా పట్టిచ్చాయి.

అది చూడగానే ఆమెకి కలిగిన మొదటి ఫీలింగ్ కోపం.

ఆపైన ఆశ్చర్యం.

'ఇది తనగురించా? నిజంగా తనగురించేనా?

అయితే ఇన్నాళ్ళూ అమ్మా, నాన్నా ఎందుకు తనకి చెప్పలేదు? అందుకే కోపం వచ్చిందామెకి.

కనీసం డాక్టర్ అంకుల్, స్నేహా ఆంటీ కూడా తన దగ్గరనుంచి ఈ విషయం ఎందుకు దాచారు? తనకు ఇప్పుడు ఏం జరగబోతుంది?

ఒక్క క్షణం ఆ లేత కళ్ళల్లో నీళ్ళు తిరిగి స్క్రీన్ మసకలేసింది.

చెప్పలేనంత భయం, ఆందోళన ఆమెని చిక్కని మబ్బుల్లా కమ్మేశాయి. తుపానులో  చిక్కిన లేత చిగురాకులా వణికిపోయింది కొన్ని క్షణాలు.

'లుకేమియా' ఈ పదం ఆమెకి తెలుసు. కేన్సర్ అంటే చాలా ప్రమాదకరమైన జబ్బు అన్నంత విషయం తెలుసు.

మరింత సమాచారం తెలుసుకోవడానికి వెంటనే 'లుకేమియా' అంటూ గూగుల్ చేసింది. వచ్చిన వివరాలని ఆపుకోలేని ఆత్రుతతో, గాభరాతో చదవడం మొదలు పెట్టింది.

అక్కడ చూపిస్తున్న వివరాలు, వ్యాధి లక్షణాలు అన్నీ తన ప్రస్తుత పరిస్థితితో సరిపోల్చుకుంటే అన్నీ ఆమెకు విపులంగా అర్థమవసాగాయి.

ఒక్కొక్కవిషయన్నీ చదువుతూ ఉన్న కొద్దీ పెద్దవవుతున్న కనుపాపల్లో చెప్పలేనంత భయం ఆమెని కుదిపేసింది.

మరుక్షణం పట్టలేనంత దు:ఖం కమ్ముకుని పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది.

ఉన్నట్టుంది ముందు గదిలోంచి పెద్ద పెద్ద వెక్కిళ్ళతో ఏడుపు వింపించడంతో  రాధిక వంటగదిలోంచి తొంగిచూసింది.

కంప్యూటర్ ముందు పెట్టుకుని చిన్నపిల్లలా ఏడుస్తున్న కూతుర్ని చూసి ఆమె కంగారుపడింది.

రెండు అంగల్లో కూతురిదగ్గరకి వచ్చి, ఆమె భుజాన్ని పట్టుకుని

" ఏమయిందిరా కన్నమ్మా? ఎందుకు ఏడుస్తున్నావు? ఎవరైనా ఏమైనా అన్నారా? సీమ ఫోన్ చేసిందా? అంటూ వరసగా ప్రశ్నలు వేస్తూ ఆమెని పొదివి పట్టుకుంది.

"ఎందుకమ్మా?" గట్టిగా స్వప్ని అరిచిన అరుపుకు అదిరిపడింది రాధిక.

" ఎందుకమ్మా, నువ్వు, నాన్నా ఇంత పెద్ద విషయం నా దగ్గరనుంచి దాచారు? ఎందుకు? నాకెందుకు చెప్పలేదు? నాకేం జరుగుతోందో నాకు తెలియద్దా?"

తీవ్రమైన చూపులతో తననే చూస్తున్న కూతురినిచూసి ఒక్క క్షణం భయపడింది రాధిక.

తీవ్రమైన వేదనకి ఎర్రబడ్డ ముఖంతో, నీళ్ళు నిండిన పెద్ద కళ్ళతో తల్లినే తీక్షణంగా చూస్తూ ఉంది స్వప్నిక..

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments